దిష్టిబొమ్మల్లా అంగన్‌వాడీ భవనాలు

- ఏడాది కాలంలో 209 భవనాలు మంజూరు
- కేవలం 8 మాత్రమే పూర్తి చేసిన వైనం
- నిధుల కొరతతో పట్టించుకోని ఐసీడీఎస్ అధికారులు
- అద్దె గదులతో సిబ్బంది, విద్యార్థుల అవస్థలు



పెనుకొండ అర్బన్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం



పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మహదేవపల్లిలో..

పెనుకొండ: పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పడకేసింది. ఎక్కడి భవనాలు అక్కడే ఆగిపోగా అనేక ప్రాంతాల్లో అద్దె భవనాల్లో అంగన్‌వాడీ సెంటర్లు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అంగన్‌వాడీ భవనాలు ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఐసీడీఎస్, ఆర్‌డీఎఫ్ స్కీముల కింద మంజూరయ్యాయి. ఇందులో ఫేజ్–1లో 2022 సంవత్సరం ముందు వరకు 457 భవనాలు మంజూరు కాగా అందులో 323 భవనాలు పూర్తయ్యాయి. 77 భవనాలు ఇంకా నిర్మాణ దశలో ఉన్నాయి. మరో 57 ఇప్పటికీ ప్రారంభం కాలేదు. 2024–25లో 209 భవనాలు మంజూరు కాగా 8 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి.

పట్టిపీడిస్తున్న నిధుల కొరత

ఒక్కో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.7 లక్షలు కాగా, అందులో రూ.5 లక్షలు వివిధ పథకాల కింద మంజూరయ్యాయి. రూ. 2 లక్షలు ఐసీడీఎస్ నుంచి విడుదల కావాల్సి ఉంది. అయితే ఆ నిధులను విడుదల చేయడంలో ఐసీడీఎస్ పూర్తిగా విఫలమైంది. దీంతో భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

డీలాపడిన కాంట్రాక్టర్లు

అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం ముందుకు వచ్చిన కాంటాక్టర్లు సకాలంలో బిల్లులు అందకపోవడం, ఐసీడీఎస్ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఇతర పథకాల నుంచి మంజూరైన నిధులను డ్రా చేసుకుని మిగిలిన పని చేయకుండా చేతులెత్తేస్తున్నారు. దీంతో పాటు అనేక ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం విషయంలో స్థల వివాదాలు నెలకొనడం సమస్యగా మారింది. వివాదాలను రెవెన్యూ అధికారులు సకాలంలో పరిష్కరించలేకపోవడం సైతం భవనాల నిర్మాణానికి అడ్డంకిగా మారింది.

భవనాల పూర్తికి చర్యలు

అంగన్‌వాడీ భవనాలను పూర్తిస్థాయిలో పరిశీలించి వాటి నిర్మాణం వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాము. ఏఏ కారణాలతో భవనాల పనులు ఆగిపోయాయన్న విషయాలను తెలుసుకొని ఐసీడీఎస్ అధికారులతో చర్చించి పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాము. నిధుల కొరత ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాము.

– మురళీమోహన్, పీఆర్ ఈఈ, పెనుకొండ సబ్‌డివిజన్

క్లుప్తంగా

వినికిడి పరికరాల పంపిణీ



వినికిడి పరీక్షలను పరిశీలిస్తున్న నిర్వాహకురాలు శిల్ప

పెనుకొండ: పట్టణంలోని షిర్డిసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 87 మందికి వినికిడి పరికరాలను ఉచితంగా అందజేశారు. ఆదివారం ఆశ్రమంలో వినికిడి పరీక్షలు, యంత్రాల పంపిణీ వైద్యశిబిరం నిర్వహించారు. 138 మంది శిబిరంలో పాల్గొన్నారు. పరీక్షల అనంతరం గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకురాలు శిల్ప వినికిడి యంత్రాలు అందజేశారు. మరో 46 మందికి ఫాలో ఆప్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులతో పాటు సిబ్బంది భాస్కరరెడ్డి, చిట్టిబాబు, హరి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు గాలికొదిలేసి రాజకీయ పర్యటనలా?

మడకశిర: రాష్ట్రంలో శాంతి భద్రతలు గాలికొదిలేసి హోంమంత్రి అనిత రాజకీయ పర్యటనలు చేయడం సబబు కాదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై పలు రకాల అఘాయిత్యాలు జరుగుతుంటే వాటిని పట్టించుకోకుండా మంత్రి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో 9వ తరగతి చదువుతున్న ఓ దళిత బాలికపై కొందరు లైంగికదాడి చేస్తే బాధిత కుటుంబానికి న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. శాంతి భద్రతలపై హోం మంత్రి దృష్టి పెట్టాలని సూచించారు.

జలధికి తరలిన పీర్లు

పెనుకొండ: పట్టణ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో పీర్లను జలధికి తరలించే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోలీసులు ముందు జాగ్రత్తలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జలధి కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హామీలు అమలు చేస్తున్నాం



పి.రొప్పాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి సవిత

రొద్దం: ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పి. రొప్పాల గ్రామంలో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం మంత్రి నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు వివరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న పత్తి పంటలను పరిశీలించారు. సాగుపై రైతులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నరహరి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సార్.. సమస్యలు పరిష్కరించండి

పావగడ: ప్రపంచంలోనే అతి పెద్దదిగా పేరు పొందిన స్థానిక సోలార్ ప్రాజెక్ట్ నుంచి ప్రభుత్వానికి లాభాలు వచ్చినా ప్రాజెక్ట్ నిర్మాణానికి వేలాది ఎకరాల సాగు భూమిని అందించిన సోలార్ రైతుల పిల్లలకు మాత్రం సోలార్ ప్రాజెక్ట్ ఉద్యోగాలు కల్పించలేదని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంటనే స్థానిక సోలార్ ప్రాజెక్ట్‌లో సోలార్ రైతుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర తాగునీటి పథకం పనులు ఇంకా పూర్తి కాకుండానే ముఖ్యమంత్రి సిద్ద రామయ్య ప్రారంభిస్తుండటం శోచనీయమన్నారు. జేజేఎం పనులు పూర్తి కాలేదన్నారు.

నేడు పావగడకు సీఎం రాక



సభా వేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ద రామయ్య నేడు పావగడకు రానున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో బెంగుళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా ముఖ్యమంత్రి పావగడకు చేరుకుంటారు. తుంగభద్ర జలాశయం బ్యాక్ వాటర్ నుంచి తాలూకా , పట్టణ పరిధిలో బహు గ్రామాల తాగునీటి సరఫరా పథకాన్ని ప్రారంభిస్తారు. అదే విధంగా 2,250 మెగావాట్స్ సోలార్ ప్లాంట్ నిర్మాణ యోజనను బహిరంగ సభలో ప్రకటిస్తారు. అలాగే తాలూకా వ్యాప్తంగా వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు. ప్రభుత్వ శాఖల నుంచి పథకాల లబ్ధిదారులకు సౌలభ్యాలు అందిస్తారు. అనంతరం పట్టణంలోని మహాత్మ గాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన భారీ సభా వేదికలో ప్రసంగిస్తారు.

మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కుట్ర

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ కుట్రతోనే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు కక్షసాధింపు రాజకీయాలు చేస్తూ రాష్ట్రాభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. మిథున్‌రెడ్డికి అసలు లిక్కర్ కేసుతో సంబంధం లేదన్నారు. రాజకీయంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని చంద్రబాబు ఎదుర్కోలేకనే అక్రమ కేసులు నమోదు చేయించి కక్ష సాధిస్తున్నారని ధ్వజమెత్తారు. కేసు నుంచి కడిగిన ముత్యంలా మిథున్‌రెడ్డి బయటకు రావడం తథ్యమన్నారు.

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం లేని మద్యం కేసును తప్పుగా సృష్టించి చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. అక్రమ అరెస్టులను ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు.

రొళ్ల: దేశంలో భారత రాజ్యాంగం నడుస్తుంటే ఏపీలో మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సన్నిహితంగా ఉండే ముఖ్య నాయకులపై అక్రమ కేసులు పెట్టి పార్టీ ప్రతిష్టతను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక సీఎం చంద్రబాబుకు వెన్నులో వణుకు పట్టిందన్నారు.

కూటమి మోసాలను వివరిద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ మేదర శంకర

గోరంట్ల: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో 143 పైగా హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. వారి మోసాలను ప్రతి గడపకూ వివరిద్దాం అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటేష్ తెలిపారు. పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరిపై ఈ బాధ్యత ఉందన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యం నడుస్తోందన్నారు. కూటమి నేతలు చేస్తున్న మోసాలు, అక్రమాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షనేతలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. సంబంధంలేని మద్యం స్కాం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ట్రెజరర్ బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, టౌన్ కన్వీనర్ మేదర శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కార్యకర్తే రారాజు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

లేపాక్షి: 'రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీలో కార్యకర్తలే రారాజు. పార్టీలో సామాన్య కార్యకర్తను కూడా గుర్తించి నాయకుడిగా తయారు చేసేందుకు అధిష్టానం అవకాశం కల్పిస్తుంది' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఆదివారం మండల కేంద్రమైన లేపాక్షిలోని చేతన కన్వెన్షన్ హాల్‌లో మండల కన్వీనర్ నిస్సార్ అహ్మద్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముందుగా బస్టాండు దగ్గర ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేతన కన్వెన్షన్ హాల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికతో పాటు రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యాదర్శి మధుమతిరెడ్డి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా కృషి చేయాలన్నారు. కొందరు నాయకులు స్వార్థం కోసం వారి రాజకీయ ఉనికి కోసం సామాన్య కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఎవరి ఒత్తిళ్లకు భయపడాల్సిన పనిలేదని, అందరికీ అండగా ఉంటామన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామిల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. వెన్నుపోటు రాజకీయాలు, అబద్దాలు, మోసాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. హిందూపురం నియోజకవర్గంలో పీఏలు రాజ్యమేలుతున్నారని, మూడుసార్లు ఎమ్మెల్యేగా బాలకృష్ణ విజయం సాధించినా... హిందూపురం వైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదన్నారు. కార్యక్రమంలో చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, స్థానిక ఎంపీటీసీ జైకిసాన్, కోఆప్షన్ సభ్యుడు బషీర్, నాయకులు శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, రామాంజనేయులు, హనోక్, దామోదర్‌రెడ్డి, మల్లన్న, చలపతి, నాగమణి, రవీంద్రారెడ్డి, నరసప్ప, రామాంజనప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, మాధవరెడ్డి, వెంకటేష్, రవికుమార్, భాస్కర్‌రెడ్డి, మంజునాథ్, ఇర్ఫాన్, అన్సార్, రామకృష్ణారెడ్డి, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సేవా పురస్కారాల అందజేత



మాణిక్యం ఇసాక్‌కు సాహితీ సేవా పురస్కారాన్ని అందిస్తున్న గజల్ శ్రీనివాస్



పురస్కారం అందుకుంటున్న కోగిర జయచంద్ర

హిందూపురం/పెనుకొండ/రొళ్ల: జిల్లాలోని బండ్లపల్లిలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మాణిక్యం ఇసాక్‌కు సారె జహాన్ సె అచ్ఛా హిందుస్తాన్ హమారా గీత రచయిత మహమ్మద్ ఇక్బాల్ సాహితీసేవా పురస్కారాన్ని ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ చేతులు మీదుగా అందించారు. హిందూపురం సెవెన్ స్టార్ ఫంక్షన్ హాల్‌లో భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉమర్ ఫారుక్ రచించిన భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. పెనుకొండకు చెందిన కవికాకి కోగిర జైసీతారాం తనయుడు, మిమిక్రీ కళాకారుడు కోగిర జయచంద్రకు కోటా శ్రీనివాస రావు కళారంగ పురస్కారం అందించారు. అలాగే రొళ్ల మండలంలోని రత్నగిరి పంచాయతీ పరిధిలోని అలుపనపల్లికి చెందిన డీహెచ్‌పీఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే సాహితి సేవ పురస్కారాన్ని అందజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేకంగా నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల రూపంలో తెలియజేసుకోవాలని సూచించారు. మండలస్థాయి అధికారులు విధిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి పాలనలో ప్రతి ఇంటికీ వంచన



మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: మండలంలోని నాగళూరు, మావటూరు గ్రామాల్లో ఆదివారం చంద్రబాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తూనే క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు. కూటమి పాలనలో ప్రతి ఇంటికి వంచన తప్ప.. సంక్షేమం లేదని నాయకులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, సర్పంచులు సునందమ్మ, నాగరాజు, ఎంపీటీసీలు రత్నమ్మ, శివయ్య, పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహా, సుధాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వినర్లు నాగళూరు బాబు, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, నారాయణస్వామి, గోపాల్‌రెడ్డి, మల్లిరెడ్డి, సుధాకర్ నాయక్, చెన్నకేశవ, నగర పంచాయతీ కౌన్సిలర్లు శేషాద్రి, సద్దాం, నాయకులు గణప్ప, శ్రీరాములు, కిష్టా, యాసిన్, బాబు, కొండలరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధి చికిత్సా శిబిరం

హిందూపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్‌లో 130వ ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరంలో ఎముకల వైద్యులు ఇమ్‌దాదుల్లా, చిన్నపిల్లల వైద్యులు రిజ్వాన్ 154 మంది రోగులను పరీక్షించారు. అలాగే వ్యాధిగ్రస్తులకు రెండు నెలలకు సరిపడే మందులు ఉచితంగా అందించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి , రామకృష్ణ, గంగిరెడ్డి. ఉగ్రప్ప తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకుడు సురేష్

అమరాపురం: మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి, మడకశిర మండలాల్లో ఉన్న బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేద్దామని ఆ సంఘం శిరిగన్నడ అధ్యక్షుడు సురేష్ పేర్కొన్నారు. ఆదివారం హేమావతిలో బ్రాహ్మణ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్, కుసుమ, రవి ప్రకాష్ తదితరులు మాట్లాడారు. ప్రతి బ్రాహ్మణ కుటుంబం నుంచి సంఘ సభ్యత్వం నమోదు తీసుకోవాలన్నారు. అదే విధంగా తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి చేర్చాలన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో 90 శాతానికిపైగా మార్కులు సాధించిన పది, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఉపకార వేతనాలు అందిస్తామన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు. సెలవురోజు కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో వెలసిన పురాతన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల ప్రతిమకు గంగాజలంతో శుద్ధి చేసి అభిషేకించారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటకాలు చేసి స్వామివారి ప్రతిమ వద్ద నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు

పారిశుధ్య లోపం

గుడిబండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అపరిశుభ్రత నెలకొంది. తరగతి గదులు, మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో విషకీటకాల సంచారంతో ఎప్పుడేం జరుగుతుందో తెలీని పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర వీడి పాఠశాలతో పాటు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

ముళ్ల కుంట



ముళ్ల కంపలతో నిండిన ఇస్లాపురం కుంట

పెనుకొండ: పెనుకొండ మున్సిపల్ పరిధిలోని ఇస్లాపురం కుంట ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. పట్టణానికి ఆనుకుని ఉన్న ఈ కుంటను అధికారులు పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా మారింది. ప్రస్తుతం ఇస్లాపురం కుంటలో ఎక్కడ చూసినా ముళ్ల కంపలే దర్శనమిస్తున్నాయి. రైల్వే పనులకు కుంట నుంచి గరుగు మట్టిని ఇష్టారాజ్యంగా తరలించడంతో రైల్వేట్రాక్ సమీపంలో లోతుగా గుంతలు పడ్డాయి. ఇక మిగిలిన ప్రాంతమంతా ముళ్లకంపలతో నిండింది. అలాగే తూము మొత్తం పూడిపోయి నీరు బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. తూము మూసుకుపోవడంతో వర్షపు వచ్చినా రైతులు పంటలకు ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కుంటలో ఉన్న ముళ్ల కంపలను తొలగించి తూముకు మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.



మట్టితో మూసుకుపోయిన తూము, కాలువ